క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



మిర్యాలగూడలో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మిర్యాలగూడ టౌన్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిష్పక్షపాతం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా సాగుతుందన్నారు. సర్వే చేస్తున్న ఉద్యోగులు జాగ్రత్తగా యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులున్నారు.

25వ వార్డులో దరఖాస్తులు..

పట్టణంలోని 25వ వార్డు సంతోష్‌నగర్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను వార్డు ఆఫీసర్ సతీష్‌తో కలిసి 25వ వార్డు కాంగ్రెస్ ఇంచార్జి గోదాల జానకిరాంరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జానకిరాంరెడ్డి మాట్లాడుతూ వార్డు ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మామిడాల సుదర్శన్, గంజి లక్ష్మి, జయమ్మ, దుర్గ, నాగలక్ష్మి, రమ్య, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఓరుగంటి శివ, సంతోష్ ఉన్నారు.

'మునుగోడు ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికావు'

మిర్యాలగూడ టౌన్ : ఎన్‌టీఆర్ ఘాట్‌ను తొలగిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని టీడీపీ నాయకులు పాగుల సైదులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ ఘాట్‌ను తొలగిస్తామంటే ఊరుకోమన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహాసభల పోస్టరు విడుదల



పోస్టరు విడుదల చేస్తున్న అఖిల్ తదితరులు

మిర్యాలగూడ టౌన్ : సిద్దిపేటలో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో జరగనున్న ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టరును బుధవారం స్థానిక సినాప్సీ కళాశాలలో ఏబీవీపీ నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సంఘటన కార్యదర్శి అఖిల్ అవిష్కరించి మాట్లాడారు.రాష్ట్ర మహాసభలో విద్యారంగం, నిరుద్యోగ సమస్యపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. మహాసభలకు విద్యార్థులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షుడు బోల్లేపల్లి మదన్‌మోహన్‌రాజు, గొట్టిపర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

వీర్లపాలెంలో పశు వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

మిర్యాలగూడ: పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో బుధవారం గోపాలమిత్ర పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ సందీప్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 54గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించినట్లు తెలిపారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏ ఉపేందర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎం.శివారెడ్డి, గోపాలమిత్రలు రాంబాబు, ప్రభాకర్, దైద శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్ యాదవ్

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాల గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 5లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం హాలియా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌ను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త రామిరెడ్డి, మాజీ సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చిట్టేపు రామనరసమ్మ, రాఘవరెడ్డి, పిట్టల కృష్ణ, సైదులు ఉన్నారు.

అధిక చలికి జాగ్రత్తలు ఇవి..

పొగమంచులో లైట్లతో ప్రయాణించాలి

మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య సూచన



నల్లగొండ : జిల్లాను చలి వణికిస్తోంది. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండడంతో జనాలు చలికి అల్లాడిపోతున్నారు. రాత్రిపూట చల్లటి గాలులు వీస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే రోడ్లపై జనాలు తగ్గిపోతున్నారు. స్వెటర్లు వేసుకోకుండా బయటకు రాని పరిస్థితి నెలకొంది. చలి తీవ్రత మరింత పెరుగుతున్నందున వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

- అత్యవసర సందర్భాల్లో ప్రయాణం తప్పనిసరి అయినట్లయితే జాగ్రత్తలు పాటించాలి.
- చలితోపాటు మంచు ప్రభావం ఈ సీజన్‌లో ఎక్కువగా ఉంటుంది.
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంటుంది. కాబట్టి ఫాగింగ్ లైట్లు వేసుకోవాలి.
- ఇండికేటర్లను కూడా ఉపయోగించాలి.
- పొగమంచులో కారులో వెళ్లేవారు ప్రధానంగా లైట్లను ఆన్ చేసి ప్రయాణించాలి.
- ద్విచక్ర వాహనదారులు ఇండికేటర్ లైట్లు, లైట్లను ఆన్‌లో ఉంచుకుని ప్రయాణం చేయాలి.
- వాహనదారులు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి వెళ్లాలి.
- చలికి వణుకుతూ వాహనం నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



- లావణ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, నల్లగొండ

సేఫ్టీ ఎలక్ట్రానిక్ వస్తువులు వాడాలి

ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయదారుడు గాలి శివకుమార్ సలహా



రామగిరి(నల్లగొండ): జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. చలికి వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే వారు చల్లటి నీటితో స్నానం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వేడి నీళ్లతో స్నానాలు చేస్తున్నారు. చలికాలంలో వాటర్ హీటర్లు, గీజర్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. వీటి వినియోగంపై నిపుణుల సూచనలు..

- సేఫ్టీగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- షాక్ ప్రూవ్ బాడీ హీటర్ వాడితే 50 శాతం విద్యుత్ షాక్ నుంచి కాపాడుకోవచ్చు.
- పాడైపోయిన హీటర్లను వాడకూడదు.
- చిన్న పిల్లలు ఉన్నవారు జాగ్రత్త వహించాలి.
- ఇంటికి తప్పనిసరిగా ఎర్త్ ఉండేలా చూసుకోవాలి.
- మెటల్ బాడీ గీజర్లు వాడొద్దు.
- పాలి కార్బోనేట్(పీసీ)తో తయారైన గీజర్ వాడాలి.
- గీజర్‌కు ఆటోమెటిక్ ఆఫ్ లేకపోతే వైరింగ్ కాలిపోయే అవకాశం ఉంది.
- కొన్నిసార్లు ఫిలమెంట్ పేలిపోయి ప్రమాదాలు సంభవిస్తాయి.



గాలి శివకుమార్, ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయదారుడు

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

- పది రోజుల్లో కేంద్రాలను మూసివేసే అవకాశం
- రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- అనుముల మండలంలో 19,903 క్వింటాళ్లు సేకరణ



పులిమామిడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం కళావతి(ఫైల్)

హాలియా : వానాకాలం సీజన్‌లో అనుముల మండల వ్యాప్తంగా చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. వారం, పది రోజుల్లో కేంద్రాలను మూసివేసే అవకాశం ఉంది. అనుముల మండలంలో ఐకేపీ ద్వారా ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో నాలుగు కేంద్రాల్లో దొడ్డురకం, మూడు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని సేకరించారు. ప్రస్తుతం నాలుగు దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావస్తుండడంతో రెండు, మూడు రోజుల్లో ఆయా కేంద్రాలను మూసివేసే అవకాశం ఉండగా మూడు సన్నరకం కేంద్రాల్లో ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాగుతోంది. మరో వారం, పది రోజుల్లో మిగితా గ్రామాల్లో సన్నరకం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి.

20వేల ఎకరాలకు పైగా..

అనుముల మండలంలో 21 గ్రామ పంచాయతీ పరిధిలో వానాకాలం సీజన్‌లో 20వేల ఎకరాలకు పైగా రైతులు వరి పంటను సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు వరినాట్లు ఆలస్యంగా వేశారు. ఆ తర్వాత కాలం కలిసి రావడంతో బాగా సాగైంది.

374 మంది రైతుల నుంచి..

మండలం పరిధిలో ఏర్పాటు చేసిన ఏడు కొనుగోలు కేంద్రాల్లో 374 మంది రైతుల నుంచి 19,903 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. ప్రభుత్వం కింటాకు ఏ గ్రేడు ధాన్యానికి రూ. 2,320, సాధరణ గ్రేడు రకానికి రూ. 2,300లుగా మద్దతు ధర, సన్నకరం ధాన్యానికి రూ. 2,800లు ధరతో సేకరించి రైతుల ఖాతాల్లో రెండు, మూడు రోజుల వ్యవధిలో డబ్బులు జమ చేశారు. మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు పులిమామిడి గ్రామంలో అత్యధికంగా 16వేల 655 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి ఎగుమతి చేశారు. సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొత్తపల్లి గ్రామం మొదటి స్థానంలో నిలిచింది. ఈ గ్రామంలో 6వేల 101 బస్తాలు, పేరూర్‌లో 1,505 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి ఎగుమతి చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎగుమతి కావడంతో మూసివేసే అవకాశం ఉంది. ఇంకా కొత్తపల్లి, పేరూర్, వీర్లగడ్డతండా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

రెండు, మూడు రోజుల్లోనే..



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రెండు, మూడు రోజుల వ్యవధిలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు కేంద్రాల్లో దొడ్డురకం, మూడు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయించిన 374 మందికి పైగా వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు ఆయా కొనుగోలు కేంద్రాల్లో 374 రైతుల వద్ద నుంచి సుమారు 19,903 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి ఎగుమతి చేశారు.

–కళావతి, ఏపీఎం హాలియా

'ఇందిరమ్మ' దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



దర్గాతండాలో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి

కొండమల్లేపల్లి : ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని గుర్రపుతండా గ్రామపంచాయతీలోని దర్గా తండాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు ఫొటోతో సహా, ఇల్లు మొత్తం కవర్ అయ్యే విధంగా ఫొటోలు తీయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని ఉండి వలస వెళ్లిన వారికి ఫోన్ లేదా ఇతర మార్గాల ద్వారా సర్వే సమాచారాన్ని తెలియజేసి తక్షణమే గ్రామానికి వచ్చి వివరాలు ఇచ్చే విధంగా చూడాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, కొండమల్లేపల్లి ఎంపీడీఓ బాలరాజురెడ్డి తదితరులున్నారు.

సర్వే పరిశీలన

గుర్రంపోడు : మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న ఇండ్ల వద్దకు వెళ్లి దరఖాస్తుదారుని పేరు, ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలు అప్లోడ్ చేసిన తర్వాతనే యాప్‌లో సబ్మిట్ చేయాలన్నారు. వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, గహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీఓ మంజుల, ఎంపీఓ పద్మ ఉన్నారు.

సర్వే వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి, మండల ప్రత్యేక అధికారి వి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి రోజు 50 ఇండ్లు సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ఏఈ పీఆర్ శ్రీనివాసరావు, ఏపీవో గోపాల్‌రెడ్డి , పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ కోరారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్‌కు వెళ్తున్న కార్మికులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి పంచాయతీ కార్మికులను ఆదుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వాడపల్లి శ్రీనివాస్, ముడుసు సైదులు, గుండె వెంకటేశ్వర్లు, సైదులు, జహీరొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

21న కబడ్డీ జట్ల ఎంపిక

హాలియా : నల్లగొండ జిల్లా జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఈ నెల 21న హాలియా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల కబడ్డీ జట్టు ఎంపిక హాలియాలోని శ్రీ శ్లోక స్కూల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు, బాలుర జట్టు ఎంపిక మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందని తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు బాలురు 75 కేజీలలోపు బరువు, బాలికలు 65 కేజీలలోపు బరువు కలిగి ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, టెన్త్ క్లాస్ మెమో, మ్యాట్ షూ తమ వెంట తీసుకు రావాలని కోరారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం, యాసంగి పంటలకు రైతుభరోసా నిధులు ఒకేసారి విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు రైతు సంఘం ఆధ్వర్యంలోగ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఎన్నికల ముందు రైతులకు ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ఇంకా 40శాతం మంది రైతులు తమకు రుణమాఫీ అవుతుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నారన్నారు. రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, మల్లు గౌతంరెడ్డి, గోవింద్‌రెడ్డి, గోలి వెంకట్‌రెడ్డి, పిలుట్ల సైదులు, కందుకూరి రమేష్, చనగాని సైదమ్మ, వెంకట్‌రెడ్డి, మట్టపల్లి వెంకటేశ్వర్లు, మంగ, పద్మ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ కాలనీలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

- పరిశీలించిన డీఎస్పీ రాజశేఖర రాజు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ట్రాఫిక్ సమస్యను పరిశీలించేందుకు ఆ శాఖ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీలో ట్రాఫిక్ సమస్యకు దారితీస్తున్న కారణాలు తెలుసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌ను డీఎస్పీ కె.రాజశేఖర రాజు పర్యవేక్షించారు. పలు ఆస్పత్రులకు సంబధించిన సెల్లార్లను ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అదే విధంగా కాలనీలో రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన ఆస్పత్రుల బోర్డులు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉండటంతో వాటిని తొలగించారు. కాలనీలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యే వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, తమ సూచనలు పాటించని ఆస్పత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఆన వెంట టూ టౌన్ సీఐ నాగార్జున, ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్‌బాబు తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

త్రిపురారం : ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. బుధవారం నిడమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన వల్లపుదాసు లక్ష్మినర్సుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 4,8000 చెక్కు నిడమనూరు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోసల శ్రీను, పోలెపల్లి ఇస్సా, గనిపల్లి చిన్ని, గంట శ్రీను, అంజయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న ఎంఈఓ తరి రాములు

పెద్దవూర: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్షల సమయం సమీపిస్తున్నందున తమ పిల్లలను ఫంక్షన్‌లు, సినిమాలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని పేర్కొన్నారు. పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు నిత్యం విద్యార్థులను పాఠశాలకు పంపేలా చూడాలని కోరారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంపదను దోచిపెడుతున్న మోదీ

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: ప్రజా సంపదను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. దేశంలోని మతోన్మాద శక్తులు, దాని అనుబంధ సంఘాలు అధికారంలో ఉండడం వల్ల మైనార్టీ మతాలపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తూ నిధులు మంజూరు చేయడంలో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని, రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, పిలుట్ల సైదులు, సైదమ్మ, రమేష్‌బాబు, రామకృష్ణ, శ్రీనివాస్, గోవిందరెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, కాంతారెడ్డి, వెంకట్‌రెడ్డి, నగేష్, నాగేంద్రప్రసాద్, మర్రి పద్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిర్యాలగూడ: పట్టణంలో సత్వరమే భూసేకరణ చేపట్టి రహదారి అభివృద్ధి పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ వాణిజ్య సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓంప్రకాశ్ అన్నారు. బుధవారం సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 2022లో పట్టణంలో రోడ్లు వెడల్పు చేయడానికి జాతీయ రహదారులు న్యూఢిల్లీ ద్వారా రూ.124కోట్లు మంజూరు కాగా అందులో రూ.75కోట్లు భూసేకరణ, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వడానికి కేటాయించినట్లు తెలిపారు.నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోయినా, కోర్టు కేసులు ఉన్నా మంజూరైన నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉన్నందున స్పందించాలని కోరారు. కార్యక్రమంలో హీనయత్ అహ్మద్‌ఖాన్, పగిడి రామలింగయ్య, పోలగాని వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

డిప్యుటేషన్లు రద్దు చేయాలని వినతి

చింతపల్లి: ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని టీఎస్ యుటీఎఫ్ చింతపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ నీరడు అంజయ్యకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిలివేరు నారాయణ, ముసుగు ఆనంద్ బాబు మాట్లాడారు. కొందరు ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నా వివిధ పాఠశాలలకి డిప్యుటేషన్లపై వెళ్లారని తెలిపారు.



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

సాంబశివరావుకు జానారెడ్డి నివాళి



నివాళులర్పిస్తున్న జానారెడ్డి

నాగార్జునసాగర్ : సాగర్ ప్రాజెక్ట్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన సాంబశివరావు అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పైలాన్ కాలనీలో సాంబశివరావు ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్ర శేఖర్‌రెడ్డి, జంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పెద్దవూర: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య అన్నారు. బుధవారం మండలంలోని పులిచర్ల గ్రామంలో నిర్వహించిన సీపీఎం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పులిచర్ల గ్రామ కార్యదర్శిగా చాట్ల వెంకటయ్య, కమిటీ సభ్యులుగా హనుమంతు, ఖాసీం, ఆంజనేయులు, ఎస్‌కే సైదులు, కొండలు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం అందజేత

చందంపేట : చందంపేట మండలంలోని చిత్రియాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ గోలి గిరి హెచ్‌ఎం. మల్లేశ్వర్ నాయక్, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు అచ్యుత్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కేజీబీవీ ఎదుట ధర్నా

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీశ్, కోరే రమేష్ కోరారు. బుధవారం తిరుమలగిరి (సాగర్) మండల కేంద్రంలో కేజీబీవీ ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మెకు ఎస్‌ఎఫ్‌ఐ సంఘం నాయకులు మద్దతు తెలిపి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శివాని, మహేశ్వరీ, శోశిత ఉన్నారు.

బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

మిర్యాలగూడ టౌన్ : హన్మకొండలో ఈనెల 29, 30, 31వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా స్థాయి అండర్-15 , అండర్-19 బాలబాలికల జట్లను నల్లగొండ ఇండోర్ స్టేడియంలో ఎంపిక చేశారని జిల్లా కోచ్ రామకృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి కుంభం నర్సిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోచ్‌లు రామకృష్ణ, ప్రకాశ్ అభినందించారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

డిండి: అయ్యప్ప మాలధారులకు బుధవారం మండల కేంద్రంలోని బల్మూరి సైదులు ఇంటి వద్ద అన్నదానం ఏర్పాటు చేసారు. అంతకుముందు సైదులు స్వగృహంలో అయ్యప్ప చిత్రపటం వద్దభక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు కార్యక్రమంలో శ్రీపతిరావు, మల్లేష్, శ్రీనువాసులు, వెంకటయ్య, మహేష్, మధు, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా కిట్లు పంపిణీ

నాగార్జునసాగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ మామిడి పద్మ అన్నారు. బుధవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీ ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10వేల విలువైన క్రీడా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత రేపాల మదన్‌మోహన్, అశోక్‌రెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఉందని ప్రహరీ కూల్చేశారు

మిర్యాలగూడ: తమ స్థలంలో ప్రభుత్వ భూమి ఉందని అధికారులు ప్రహరీ కూల్చేసి బోర్డు ఏర్పాటు చేశారని మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాయపూడి భవాని ఆవేదనవ్యక్తం చేశారు. బాధితురాలు బుధవారం తన భూమి వద్ద విలేకరులతో మాట్లాడారు. 2012లో పట్టణ శివారు బపాస్ రోడ్డులో 711/ఆ ముప్పా అవినాష్ వద్ద నుంచి 22గుంటల భూమిని కొనుగోలు చేశానని తెలిపారు. దీనికి సంబంధించి మున్సిపాలిటీ అనుమతి, ఎల్‌ఆర్‌ఎస్ ఉందన్నారు. నాలుగేళ్ల క్రితం భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటు పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే నెం .626లో ప్రభుత్వ భూమి ఉందని సాకు చూపి సమాచారం ఇవ్వకుండా ఫెన్సింగ్ కూల్చి వేశారని ఆరోపించారు. తమ స్థలానికి గేటు పెట్టుకునేందుకు అధికారులు అవకాశం కల్పించాలని, బోర్డు తొలగించాలని కోరారు. ఆమె వెంట రాయపూడి ఉమాశేఖర్, వెంకటేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న రాయపూడి భవాని